పొంచి ఉన్న ప్రమాదం

- మందుబాబులకు అడ్డాగా సైట్లు
- ఓఎన్జీసీ బావుల వద్ద కొరవడిన రక్షణ

మామిడికుదురు: చమురు, సహజవాయువులను సరఫరా చేస్తున్న ఓఎన్జీసీ బావుల వద్ద రక్షణ కొరవడింది. ఉత్పత్తిలో ఉన్న బావులతో పాటు ఉత్పత్తి నిలిచిపోయిన బావుల వద్ద ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అన్న భయంతో నగరం దీవి ప్రజలు నిరంతరం ఆందోళన చెందుతున్నారు. 2014 జూన్ 22వ తేదీన నగరంలో జరిగిన గ్యాస్ పైప్‌లైన్ విస్ఫోటనంలో 22 మంది మృత్యువాత పడ్డారు. నాటి పీడ కల నగరం దీవి ప్రజలను నేటికీ వెన్నాడుతోంది. నాటి సంఘటనలు ఓఎన్జీసీ కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల ప్రజలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామంలోని పాశర్లపూడి-27 బావి వద్ద మంగళవారం రాత్రి ఆకతాయిల చర్యతో జరిగిన అగ్ని ప్రమాదంతో స్థానికులు తీవ్రంగా ఆందోళన చెందారు. నగరంలోని తాటిపాక జీసీఎస్‌కు గ్యాస్ సరఫరా అవుతున్న బావి వద్దనే మంటలు చెలరేగడంతో భారీ ప్రమాదం ముంచుకొచ్చిందని ప్రజలు భీతిల్లారు. స్థానికులు ఓఎన్జీసీకి వెంటనే సమాచారం అందించడం, ఆగమేఘాల మీద ఓఎన్జీసీ అధికారులు బావి నుంచి సరఫరాను నిలిపివేయడం, ఓఎన్జీసీకి చెందిన రెండు ఫైరింజిన్లు, రాజోలు నుంచి మరో ఫైరింజిన్ సంఘటన స్థలానికి చేరుకుని సకాలంలో మంటల్ని అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

13కు పైగా ఓఎన్జీసీ బావులు..

నగరం దీవిలోని పాశర్లపూడి, నగరం, వేగివారిపాలెం ప్రాంతాల నుంచి నగరంలోని తాటిపాక జీసీఎస్‌కు పైప్‌లైన్ ద్వారా 13కు పైగా బావుల నుంచి ప్రతి నిత్యం చమురు, సహజ వాయువు సరఫరా అవుతుంది. వీటితో పాటు ఉత్పత్తి నిలిచిపోయిన బావులు మరో ఎనిమిదికి పైగా ఉన్నాయి. ఆయా బావుల వద్ద ప్రస్తుతం ఏ విధమైన రక్షణ చర్యలు చేపట్టలేదు. గతంలో ఓఎన్జీసీ బావుల వద్ద నిరంతరం సెక్యూరిటీ గార్డు కాపలా ఉండేవారు. రాను రాను సెక్యూరిటీకి ఓఎన్జీసీ మంగళం పాడింది. బావి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాటి రక్షణను గాలికి వదిలేశారన్న విమర్శలు ఉన్నాయి. ఓఎన్జీసీ సైట్లలో మందుబాబులు నిత్యం రాత్రి, పగలు తేడా లేకుండా మందు కొట్టడం, అక్కడే పొగతాగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ కార్యకలాపాలు యథేచ్ఛగా జరుగుతున్నా వాటిని అదుపు చేయలేని పరిస్థితి. రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీ ఎస్పీఎఫ్)కు ఓఎన్జీసీ బావుల రక్షణ బాధ్యతను అప్పగించారు. ఎస్పీఎఫ్ సిబ్బంది ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో ఓఎన్జీసీ బావులను పరిశీలించాల్సి ఉంది. వీరి గస్తీ నామమాత్రంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



పాశర్లపూడిలోని పాశర్లపూడి-27 బావి



ఓఎన్జీసీ బావి వద్ద తాగి పడేసిన మద్యం సీసాలు

మంటలు ఆందోళన కలిగించాయి



పాశర్లపూడి బావి వద్ద మంగళవారం రాత్రి భారీగా మంటలు చెలరేగాయి. ఏదో ప్రమాదం జరిగిందని ఆందోళన చెందాం. వరుసగా మూడు ఫైరింజన్లు రావడం కలవర పెట్టింది. మంటలు గంటల వ్యవధిలోనే అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నాం. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి. బుధవారం ఉదయం పోలీసులు వచ్చి ఏదైనా జరిగితే ఫోన్ చేయమని నెంబర్లు ఇచ్చి వెళ్లారు. ఇలా అయితే ఎలా. ఆకతాయిలకు సైటు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో చాలా మంది వచ్చి వెళ్తున్నారు. వారిని అదుపు చేయాలి. లేకుంటే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

– రాయుడు శ్రీనివాసరావు, పాశర్లపూడి

రక్షణ ఏర్పాటు చేయాలి



ఓఎన్జీసీ బావుల వద్ద నిరంతరం రక్షణ ఉండే విధంగా ఓఎన్జీసీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి. గతంలో సెక్యూరిటీ గార్డు కాపలా ఉండేవారు. కానీ ఇప్పుడు లేరు. ఓఎన్జీసీ సైట్లలో పశువులను మేపడం, అక్కడే పొగతాగడం వంటి పనులు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఏ విధమైన రక్షణ చర్యలు చేపట్టలేదు. పాశర్లపూడి, నగరం గ్రామాల్లో ఎక్కడ చూసినా ఓఎన్జీసీ బావుల వద్ద ఇదే పరిస్థితి. ప్రమాదం జరగకముందే ఓఎన్జీసీ అధికారులు కళ్లు తెరవాలి. పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలి.

– కట్టా రామకృష్ణ, పాశర్లపూడి

క్లుప్తంగా


అవ్వాతాతల్లో పింఛన్ టెన్షన్

అంబాజీపేట: అవ్వాతాతల్లో పింఛన్ టెన్షన్ నెలకొంది. ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అండ్ కో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో వలంటీర్ల సేవలు దూరమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత రెండు నెలలుగా ఇంటి వద్దకు పింఛన్ రాక అవ్వాతాతలు నానా అగచాట్లు పడ్డారు. జూన్ నెలలోనూ చంద్రబాబు పుణ్యమా అని పింఛన్ కోసం తిప్పలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబాజీపేట మండలంలో ప్రస్తుతం 9,395 మంది పింఛనుదారులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మార్చి నెల వరకు పింఛన్ నగదు లబ్ధిని వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే అందించింది. ప్రతి నెలా సుమారు రూ.2,65,85,500 మేర నగదు పంపిణీ జరుగుతోంది. ఎన్నికల నేపథ్యంలో విపక్షాల ఫిర్యాదుపై ఈసీ ఆదేశాల మేరకు గత రెండు నెలలుగా 6,454 మందికి బ్యాంకుల్లో పింఛన్ జమ చేస్తున్నారు. కేవలం 2,941 మందికే సచివాలయ సిబ్బందితో నేరుగా వారిళ్లకు వెళ్లి పింఛన్ లబ్ధి అందిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకుల్లో నగదు తీసుకోవడం అవ్వా తాతలకు తలకు మించిన భారంగా మారింది.

పింఛన్ సొమ్ము రూ.2.92 కోట్లు విడుదల

మామిడికుదురు: మండలంలోని 18 గ్రామాలకు చెందిన 10,161 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము రూ.2,92,16,500 నిధులు విడుదలయ్యాయని ఏఓ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. లబ్ధిదారుల్లో 7,191 మంది లబ్ధిదారులకు రూ.2,15,73,000 నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమవుతాయన్నారు. మిగిలిన 2,970 మందికి రూ.76,43,500 నగదును సచివాలయ ఉద్యోగులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తారని తెలిపారు. జూన్ 1వ తేదీ శనివారం నుంచి పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు.

374 మందికి వైద్య సేవలు



పెదపట్నంలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ హుస్సేన్

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం పెదపట్నంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత, కిమ్స్ వైద్యులు అనూష, శ్రీరామకృష్ణ, ఆప్తాలమిక్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో 374 మందికి ఉచితంగా వైద్య సేవలందించి, మందులు అందజేశారు. వేసవి కాలంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలు రకాల పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో సూపర్ వైజర్లు బీహెచ్ సత్యనారాయణ, సీత, సత్యవతి, పీహెచ్ఎన్ నారాయణమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

పి.గన్నవరం: విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి కె.కమలకుమారి సూచించారు. పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కోన హెలీనా అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు మండల స్థాయిలో శిక్షణ తరగతులు, వంటల పోటీలు నిర్వహించారు. పీఎం పోషణ్ పథకం నిర్వహించే మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వంట సహాయకులు తాజ్ హోటల్ తరహాలో హాట్ పొంగల్, వెజ్ పలావ్, ఎగ్‌కర్రీ తయారు చేసే విధానాన్ని ఆన్‌లైన్ ద్వారా వీడియోలో ప్రదర్శించారు. అనంతరం వాటిని నిర్వాహకుల చేత తయారు చేయించారు. సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ ఏఎల్ఎస్ఓ డి.రమేష్ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యంతో మెరుగైన ఆరోగ్యం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి ప్రజలందరికి మెరుగైన ఆరోగ్యాన్ని అందించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యారోగ్యశాఖ అధికారులు కోరారు. డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరిచేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. మండలంలోని పెనికేరులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జరిగింది. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈ ఏవీవీ రాజా పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్ గర్వకారణం



గోపాలపురంలో డాక్టరేట్, అవార్డు గ్రహీత సుబ్బారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: అధ్యాపకుడు వులుసు సుబ్బారావు బహుముఖ ప్రజ్ఞను గుర్తించిన జీహెచ్‌పీయూ ఈ నెల 25 న చెన్నైలో గౌరవ డాక్టరేట్, భారత్ కళారత్న అవార్డులను ప్రదానం చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం రావులపాలెం మండలం గోపాలపురంలో సుబ్బారావు అందుకున్న డాక్టరేట్, అవార్డు సర్టిఫికెట్స్, మెడల్, మెమెంటోలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరిశీలించి, దుశ్శాలువాతో సత్కరించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ అధ్యాపకుడిగా, కవి, రచయితగా, పౌరాణిక రంగస్థల, సాంఘిక నాటక కళాకారుడిగా, పాత్రికేయుడిగా సుబ్బారావు అందరికీ సుపరిచితులని అన్నారు. ఆయనకు ప్రతిష్టాత్మక డాక్టరేట్, అవార్డు రావడం ఈ గ్రామానికి, తమకే కాక నియోజకవర్గానికే గర్వకారణమని అన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల జిల్లా సభ్యులు కొల్లి శ్యాంసన్, సఖినేటి వాకులరాజు, బొక్కా లోకేష్, నెక్కంటి బుజ్జి, నామాల శ్రీను తదితరులు సుబ్బారావును అభినందించారు. గౌరవ డాక్టరేట్, కళారత్న అవార్డులను అందుకున్న వులుసు సుబ్బారావును ప్రముఖ అంతర్జాతీయ శిల్పి, శ్రీనాథ రత్నశిల్పి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు డి.రాజీకుమార్ వుడయార్, నటరాజ కళాసమితి అధ్యక్షుడు నల్లా సత్యనారాయణమూర్తి, స్థానిక కళాసాహితీ అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవశరాజు, ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు, సభ్యులు షేక్ గౌస్, ఏబీసీ దేవ్, ఎండీ ఖాజామొహిద్దీన్ తదితరులు అభినందించారు.

డ్రైన్ పూడికతీత పనుల ప్రారంభం



విశ్వేశ్వరాయపురంలో డ్రైన్ పూడిక తీత పనులు ప్రారంభించిన తహసీల్దార్ లలిత కుమారి

మలికిపురం: విశ్వేశ్వరాయపురం పంచాయతీ దగ్గర నుంచి లక్కవరం సరిహద్దు రైస్ మిల్లు వరకు డ్రైన్ పూడికతీత పనులను శుక్రవారం తహసీల్దార్ జి.లలిత కుమారి ప్రారంభించారు. స్థానిక రైతుల వేపచెట్టు డ్రైన్ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్ తక్షణమే స్పందించి అధికారులు పర్యవేక్షణలో పనులు ప్రారంభించినట్లు ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గుబ్బల రమేష్, సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా, హరికృష్ణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.వేణు, వీఆర్వో విస్సు పాల్గొన్నారు.

కంపోస్టుతో మెరుగైన ప్రయోజనాలు

మలికిపురం: సేంద్రియ ఎరువుల వాడకం అలవాటు చేసుకోవాలని, కంపోస్టును స్వయంగా తయారు చేసుకుని వాడుకోవాలని తద్వారా మెరుగైన ప్రయోజనాలను పొందవచ్చని ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు పేర్కొన్నారు. మండలంలోని కత్తిమండలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో కంపోస్టు తయారీ విధానంపై తాడేపల్లిగూడెం వ్యవసాయ క్షేత్రం సిబ్బంది సహకారంతో కంపోస్టు తయారీ విధానంపై శిక్షణ జరిగింది. ఎంపీడీఓ పాల్గొని వివరించారు. అందుబాటులో ఉన్న వనరులతో కంపోస్టు తయారు చేసుకవాలని సూచించారు. కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

ధూమపానం వద్దు.. జీవితమే ముద్దు



పెదపళ్లలో పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తున్న వైద్యారోగ్యశాఖ

ఆలమూరు: ప్రజల ప్రాణాలను హరించే పొగాకు ఉత్పత్తులను ప్రోత్సహించకూడదని, వినియోగించవద్దని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు పి.భవానీశంకర్. డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయి కిషోర్ నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది శుక్రవారం ప్రపంచ పొగాకు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రతినిధులు ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటికీ వెళ్లి పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలను, దుష్ఫలితాలను వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ధూమపానం వద్దు–జీవితమే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈలు ఏవీవీ.రాజా, బి.సూర్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి, ఫార్మసిస్టు డి.సుగుణలక్ష్మి, ఆరోగ్య ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండండి

మామిడికుదురు: పొగాకు బారిన పడి ఎంతో మంది పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారని హెల్త్ అసిస్టెంట్ కేవీ సూర్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ బీహెచ్ ఇందిర పేర్కొన్నారు. వరల్డ్ నో టుబాకో డే సందర్భంగా శుక్రవారం పాశర్లపూడి-1 సచివాలయం వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ధూమపానం చేసిన వారికే కాకుండా ఆ పొగను పీల్చిన వారికి కూడా ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడంతో పాటు పొగాకు వల్ల కలిగే నష్టాలను, వ్యాధులను ప్రతి ఒక్కరికి వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం డి.భూలక్ష్మి, ఆశ కార్యకర్త కేవీ లక్ష్మి పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరల్డ్ నో టుబాకో డే సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం



ముక్తేశ్వరంలోని క్షణముక్తేశ్వరాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడపా శ్రీను

అయినవిల్లి: ముక్తేశ్వరం క్షణ ముక్తేశ్వరాలయం వద్ద వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన అడపా శ్రీను శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. భక్తులు, ప్రయాణికులు వేసవి తాపంతో విలవిలలాడటం చూసి తాను చలివేంద్రాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి తీవ్రత ఉన్నంత వరకూ తాను ఈ సేవ చేస్తానన్నారు. అలాగే ఆయన మాట్లాడుతూ దేవదాయశాఖ, వివిధ ప్రభుత్వ ఉద్యోగులు ముందుకొచ్చి వేసవిలో ప్రయాణికులు, భక్తుల దాహార్తిని తీర్చాలని కోరారు. ఎప్పుడు తమ విధులకే పరిమితం కాకుండా ప్రజలకు సేవలందించడం తమకు తోచిన సాయం అందించాలని ఆయన కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తో కష్టాలు తొలగిపోయాయి. గ్రామంలో గురువారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనిపై స్పందించిన గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సత్వరమే అధికారులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానే శుక్రవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపారు. సర్పంచ్ తమ్మన చూపిన చొరవను పలువురు గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.

కొమ్మాకొమ్మా కన్నావమ్మా..రంగుల పూవులని..



ఒకే మందార కొమ్మకు రెండు రంగుల్లో పూసిన పూలు

పి.గన్నవరం: ఒకే కొమ్మకు రెండు రంగుల్లో పూలు పూసిన మందార చెట్టు స్థానికులను విశేషంగా ఆకర్షిస్తోంది. పి.గన్నవరం మండలం మొండెపులంక శివారు పుచ్చల్లంక గ్రామంలో మడిమెట్ల రాంబాబు (బాబీ) ఇంటి ఆవరణలో ఉన్న మందార చెట్టుకు గత కొన్ని రోజులుగా రెండు వర్ణాల్లో పూలు పూస్తున్నాయి. ఈ పూలు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

వెబ్ కౌన్సెలింగ్‌కు 61 మంది హాజరు

అయినవిల్లి: ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో పాలిసెట్ 2024 వెబ్ కౌన్సెలింగ్ సెంటర్‌కు 61 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.విశాల తెలిపారు. 59001 ర్యాంకు నుంచి 75000 ర్యాంకు వరకూ విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగిందన్నారు. జూన్ ఒకటో తేదీన 75001 ర్యాంకు నుంచి 92000 వరకూ వెబ్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

వైభవంగా తిరుచ్చి పల్లకి సేవ



బండారులంకలో వేంకటేశ్వరస్వామికి తిరుచ్చి పల్లకి సేవ

అమలాపురం రూరల్: బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసి ఉన్న పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా తిరుచ్చి పల్లకిసేవ నిర్వహించారు. తిరుచ్చి పల్లకిపై స్వామి, అమ్మవార్లను ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. వేద పారాయణ, కోలాటాలు, భజనలతో 300 మంది మహిళలు వెంట సాగారు. దారి పొడవునా భక్తులు స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు ఇచ్చారు. అన్నదాన మహిళా సేవా సమితి సభ్యులు ఏకరూప చీరలు ధరించి పాల్గొన్నారు. అమలాపురం కేశవ భజన మండలి సభ్యురాలు రత్నమాల ఆధ్వర్యంలో కోలాటం, బండారులంక రామభజన మండలి వారిచే కోలాటం, బండారులంక పాండురంగ విఠల భజన సమాజం, నల్లచెరువు ఇస్కాన్ భజన బృందంచే భజనలు, అమలాపురం ఆర్ట్ ఫ్యామిలీ విద్యార్థుల కోలాటం, అన్నమయ్య కీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత ఆలయ అర్చకుడు భీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో బట్టా గణేష్, శ్రీదేవి దంపతులచే స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు.

వెంకన్నకు మామిడి పండ్లతో అభిషేకం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శుక్రవారం 1,116 మామిడి పండ్లతో అభిషేకం జరిగింది. పట్టణానికి చెందిన కిరాణా హోల్‌సేల్ వ్యాపారి రేపాక సత్యనారాయణచే మామిడి పండ్ల అభిషేకం కన్నుల పండువగా సాగింది. గతంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా సత్యనారాయణ పనిచేశారు. ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, వివిధ వ్యాపార సంఘాలకు చెందిన ప్రతినిధులు ఈ అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు, అర్చకుల సమక్షంలో ఈ మామిడి పండ్ల అభిషేకం జరిగింది.

వైభవంగా స్వామి వార్ల కల్యాణం



గోగన్నమఠంలో స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామంలో కొలువుదీరిన చతుర్భుజ భద్రాది సీతారామస్వామి, శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి వార్ల దివ్య వార్షిక తిరు కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఆలయ అర్చకులు స్వామి వార్ల దివ్య తిరు కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువలా జరిపించారు. ఉదయం స్వామి వార్ల ధ్రువమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించిన అనంతరం కల్యాణం జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు కల్యాణ కర్తలుగా పాల్గొని స్వామి వారి కల్యాణ క్రతువు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం రాత్రి స్వామి వార్ల పుష్పోత్సవం కమనీయంగా జరిపించారు. ఈ కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తన్మయత్వం పొందారు.

అమ్మవారికి బంగారు దుద్దుల సమర్పణ

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో వేంచేసిన ధనలక్ష్మి అమ్మవారికి శుక్రవారం బంగారు ఆభరణాలు సమర్పించారు. మడికి గ్రామానికి చెందిన కొడమంచిలి లక్ష్మి సుమారు రూ.30 వేలు విలువైన బంగారు దుద్దులను సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ చేతుల మీదుగా ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ పురోహితులు మున్నంగి ప్రభాకరశర్మ వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ఆభరణాలను అలంకరించారు.

నేడు హనుమజ్జయంతి

అంబాజీపేట: మండలంలో హనుమజ్జయంతి వేడుకలను శనివారం నిర్వహించేందుకు ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. అంబాజీపేట పశువుల మార్కెట్‌లో అభయాంజనేయస్వామి, గంగలకుర్రు అగ్రహారం ముషిణివారిపాలెం హనుమాన్ జంక్షన్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి, పెద్దవీధిలోని నాగమెల్లు చెట్టు వద్ద ఉన్న దాసాంజనేయ స్వామి, ఇరుసుమండలోని భక్తాంజనేయ స్వామి, వ్యాఘ్రేశ్వరంలో ఆంజనేయ స్వామి, గంగలకుర్రు, చిరతపూడి, తొండవరంతో పాటు పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించి అన్నసమారాధనలు చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు సత్తెమ్మ తల్లి జాతర

మామిడికుదురు: స్థానిక ఆల్‌క్యాస్ట్ కాలనీలో కొలువుదీరిన సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవం శనివారం రాత్రి జరుగుతుందని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తారని, 6వ తేదీ గురువారం అన్న సమారాధన జరుగుతుందని కమిటీ పేర్కొంది. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు. కాలనీ వాసులు అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా దక్షిణామూర్తి వార్షికోత్సవం

అంబాజీపేట: ఇరుసుమండలో వేంచేసియున్న బాల త్రిపుర సుందరి సమేత ఆనంద్ రామేశ్వర స్వామి ఆలయంలో శ్రీమేధా దక్షిణామూర్తి ప్రథమ వార్షికోత్సవ వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల పర్యవేక్షణలో సుంకర వెంకటస్వామి నాయుడు, సీతారామదాసునాయుడు దంపతుల ఆధ్వర్యంలో మేధా దక్షిణామూర్తి ప్రత్యేక పూజలతో పాటు గణపతి పూజ, రుద్రాభిషేకాలు నిర్వహించారు. మేధా దక్షిణామూర్తి గురించి పలు అంశాలను ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు

అంబాజీపేట: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ప్రత్యేక అవసరాల గల పిల్లల గుర్తింపునకు శుక్రవారం సర్వే చేపట్టారు. గత నెల 3 నుంచి మండలంలో ఈ సర్వే నిర్వహించినట్లు ఐఈఆర్‌టీలు ఎస్‌కే బేగం, ముత్తాబత్తుల ఆశాలు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 14 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లల్ని గుర్తించామన్నారు. వీరికి ఫిజియోథెరపీ, ఉచితంగా విద్యా బోధన, యోగా, శారీరక కదలికలు వంటి ఆసనాలు నేర్పిస్తున్నట్లు ప్రత్యేక అవసరాల గల పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఈ నెల 7 వరకు ఈ సర్వే కొనసాగించనున్నామన్నారు.

మండల స్థాయి శిక్షణ

మలికిపురం: మండల విద్యాశాఖ కార్యాలయం, మలికిపురంలో శుక్రవారం మండల స్థాయి మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఎంఈవో వైవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అందరూ 100 శాతం మధ్యాహ్నం భోజనం చేసేలా మధ్యాహ్నం భోజనం మెనూ సమర్థవంతంగా అందించడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. తదుపరి మధాహ్నం భోజన పథకంలో వంట చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలను లక్కవరం పీహెచ్‌సీ ఈఓ ఆకుమర్తి చంటి వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విశ్వేశ్వరయపురం ప్రధానోపాధ్యాయులు సీహెచ్ బాల చింతామణి, ఉపాధ్యాయులు ఆర్.శేఖర్, యంఐయస్ఆర్ రవి, సీఆర్పీటీలు, పీటీఐటు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.